

## సార్ ! థ్యాంక్యూ సార్ !

సదాశివంకు నవ్వొచ్చింది. ఎంత ఆపుకుందామన్నా ఆగకుండా అతనికి నవ్వు వచ్చింది. తన ముందున్నది ఇంటర్వ్యూ కమిటీ అని తెల్సికూడ అతనికి నవ్వు వచ్చింది.

రాదు మరీ ! ఆ కమిటీలో ఒకాయన ఎర్రగా బుర్రగా బొద్దుగా బుర్రమీసాలతో ఓ వెధవ ప్రశ్న అడిగాడు. ఆ ప్రశ్నకు వాళ్ళిచ్చే ఉద్యోగానికి అస్సలు సంబంధమే లేదు. అందుకే నవ్వొచ్చింది.

" చూడు సదాశివం నవ్వడం కాదు – నేను అడిగిందానికి సమాధానం చెప్పు – నా ప్రశ్నను ఇంకోసారి అడుగుతున్నాను – ఒక ప్రముఖ గ్రామఫోన్ కంపెనీ బొమ్మలో ఒక కుక్క ఉంది. అది మొగదా – ఆడదా?" మళ్ళీ ఆ బుర్రమీసాలతను అడిగాడు.

" సార్ నాకు కొంత టైమిస్తే చెప్పగలను సార్ !" వినయంగా అడిగాడు సదాశివం.

" ఎంత టైం కావాలి ?" అతను ఆశ్చర్యంగా అడిగాడు.

" కనీసం ఓ రెండు గంటలు !" చెప్పాడు సదాశివం.

" ఆ ! రెండు గంటలా? అంత సేపు ఆలోచిస్తావా? ఇది యింటర్వ్యూ ! అంత టైము నీ ఒక్కడికే యిస్తే నీ వెనకాల కాండిడేట్లను ఎప్పుడు ఇంటర్వ్యూ చెయ్యాలి?" అతను కోపంగా అడిగాడు.

" నిజమే సార్ ! కాని నేను ముందు ఆ గ్రామఫోన్ కంపెనీ ఫోన్ నెంబరు – అడ్రస్సు కనుక్కోవాలి కదు సార్ – ఆతర్వాత వాళ్ళకు ఫోన్ చేసి అడగాలి కదు సార్ – తర్వాత వాళ్ళు ఆ కుక్కను పరిశీలించి నాకు సమాధానం చెప్పాలి కదు సార్ ! అందుకని సార్ !" అతి వినయంగా సమాధానం చెప్పాడు సదాశివం.

" చూడు పరబ్రహ్మం – సైన్సు చదువుకున్న అభ్యర్థులను ఇలాంటి క్వశ్చన్లు అడిగితే ఇదే యిబ్బంది – వాళ్ళు ప్రతిదీ పరిశీలించి కాని జవాబు చెప్పనంటారు." ఇంకో కమిటీ మెంబరు విశ్వామిత్రుడు చికాగ్గా చెప్పాడు.

" అది కాదు విశ్వామిత్రా – దీంలో పరిశీలించాల్సిన అవసరం లేదు. ఇది కామన్ సెన్సు క్వశ్చను !" పరబ్రహ్మం ఇంకా చికాగ్గా చెప్పాడు.

" అదే - కామన్‌సెన్స్ ఈజ్‌నాట్ సో కామన్ అన్న కామన్‌సెన్స్ మీకులేదా పర్రబ్రహ్మం!" మూడో కమిటీ మెంబరు అవతారం అరిచాడు. అవతారం ఆ కమిటీ ఛైర్‌మెన్ కూడా !

" సార్-మీలో మీరే ప్రశ్నలు-సమాధానాలు చెప్పుకుంటే నా గతేం కావాలి సార్?" చిన్నగా దగ్గి అడిగాడు సదాశివం.

" సరే-నీకీసారి చాలా బుజ్జి ప్రశ్న యిస్తాను -సమాధానం బాగా ఆలోచించి చెప్పు" విశ్వామిత్రుడు చెప్పాడు.

" పెద్ద ప్రశ్న కాని - చిన్న ప్రశ్న కాని నేను ఆలోచించకుండా ఎప్పుడూ చెప్పను సార్ - ఎందుకంటే చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలని మా పొట్టి బామ్మ గట్టిగా - పెద్దగా అరిచి చెప్పేది సార్ !" సదాశివం చెప్పాడు ముసి ముసి నవ్వులతో.

"ఓకే ! ఓకే ! నువ్వు ఇప్పుడు మేమున్న రూముకు వచ్చావు కదా! ఇది మూడో అంతస్తులో ఉంది కదా ! మమ్మల్ని కల్సుకోవడానికి నువ్వు ఎన్ని మెట్లు ఎక్కి వచ్చావు?" విశ్వామిత్రుడు అడిగాడు.

" సారీ సార్ ! నేను లిఫ్టులో వచ్చాను - అందుకని మెట్లు లెక్కపెట్టలేదు." ఠపీమని సమాధానం ఇచ్చాడు సదాశివం.

" ఇట్సాల్‌రైట్! నేను నీకు చిన్నకథ చెబుతాను-అంటే పజ్జుల్. దాన్ని సాల్వు చెయ్యి!" అంటూ అవతారం చెప్పసాగాడు. "ప్రొద్దున మాయింటికి వినాయక కమిటీ చందావాళ్ళు వచ్చారు-వాళ్ళు నన్ను చందా యిమ్మని అడిగారు-దానకర్ణుడిలా నేను నాజేబులోంచి తీసి నూటపదహార్లు యివ్వబోయాను-దానికి వాళ్ళల్లో ఒకడు నావంక సీరియస్సుగా చూసి ' ఏంటి నీకంటికి మేము అడుక్కుతినే వాళ్ళలా కనిపిస్తున్నామా? కొట్టు వెయ్యి నూట పదహార్లు' అన్నాడు-దాంతో నేను షాక్ తిని నాకంత సీను లేదు ఏదో ఓ ఐదువందల పదహార్లు యిస్తానని చెప్పి నా జేబులో వెతికితే మూడువందలే దొరికాయి. చెప్పడం మర్చిపోయాను - మా ఆవిడ కూడ ఓ కంపెనీలో పని చేస్తూంటూంది... సరే బ్యాలెన్సు ఆవిడ దగ్గర అప్పుతీసుకుందామని చూశాను - కాని ఆమె అప్పుడే బాత్‌రూముకు వెళ్ళింది - నాకు తెల్సు ఆమె ఇంకోగంట దాకా బయటకు రాదని. అందుకని చనువుగా ఆమె పర్సులో గాలించి నాక్కావలసిన డబ్బులు తీసుకుని వాళ్ళని పంపించేశాను - కాని నేను షాకయింది ఏమిటంటే ఆమె పర్సులో నాకలరు ఫోటో ఉంది - అది చూసి నేను స్టన్ అయ్యాను. " గుక్క తిప్పుకోవడానికి అవతారం ఆగాడు.

" అది కాదు అవతారం ! ఆవిడ పర్సులో నీది కాకుండా - ఇంకెవడి ఫోటో అన్నా ఉంటే నువ్వు షాక్ కావాలి కాని నీ ఫోటో ఉంటే నువ్వెందుకు షాక్ కావాలి!" పర్రబ్రహ్మం

అయోమయంగా అడిగాడు.

" ఏం గురూ నీ ఫోటో అంత ఛండాలంగా తీశాడా ఎవడన్నా ఫోటో గ్రాఫరు?" విశ్వామిత్రుడు శంకించాడు.

" షటప్ ! నేను ప్రశ్నలు అడుగుతున్నది ఈ సదాశవంను మీరు మాట్లాడవద్దు." కోప్పడ్డాడు అవతారం.

" సార్! నాపేరు సదాశవం కాదు సార్, సదాశివం !" వినయంగా చెప్పాడు సదాశివం.

" ఏదైతే ఏం లేవయ్యా ! శివంకు శవంకు పెద్ద తేడా ఏముంది? సదాశివం - ఎప్పటికీ సదాశవం కాదా ఏంటి? శకారం పైన అకారం పోయి ఇకారం వచ్చింది - దానికింత వికారం ఎందుకు? ఆ ! కమింగ్ టుది పాయింటు - నేను ఎక్కడున్నాను?" అడిగాడు అవతారం సదాశివంను.

" అదే సార్-మీ ఆవిడ పర్సులో మీ ఫోటో చూసి మీరు షాకయి - అవాక్కులయ్యారు-" చెప్పాడు.

" షాకయ్యాను కాని - అవాక్కుని కాలేదు - ఇంతలో నేను షాక్ నుండి కోలుకునే సరికి మా ఆవిడ బయట కొచ్చింది... నేను భక్తితో ఆమె రెండు చేతులు పట్టుకుని కరిగి పోతూ చెప్పాను. ' ఒసే అండాళ్ళు ! ఇన్నాళ్ళు నిన్ను నేను అపార్థం చేసుకున్నాను - నేనంటే భక్తి విశ్వాసాలు లేవనుకున్నాను కాని - నా ఫోటోను నీ గుండెల్లో, సారీ , అదే నీ గుండెల్లో  పెట్టుకునే పర్సులో, పెట్టుకుని కొలుస్తున్నావు అంటే ఏంటి నీ ఉద్దేశ్యం ! నన్ను ఎప్పుడూ స్మరించుకుంటూ, కళ్ళకు అద్దుకుంటావా? సీతా, సావిత్రి, అనసూయ సరసన నిన్ను కూడ కూర్చోపెట్టాలి! అని కన్నీళ్ళు కార్చాను - అందుకు ఆమె ఏమందో తెల్సా?" ఆగాడు అవతారం గుక్కతిప్పుకోవడానికి.

" ఏమందేంటి గురూ !" విశ్వామిత్రుడు అడిగాడు ఆసక్తిగా.

" ఆవిడ ఏమన్నా అననీ కానీ - దానికీ, ఈ ఇంటర్వ్యూకు ఏదన్నా సంబంధం ఉందా అవతారం?" పరబ్రహ్మం అడిగాడు బుర్రగోక్కుంటూ.

" సార్ - దయచేసి ఆమె పేరు - ఆమె పనిచేసే కంపెనీ అడ్రస్సు, సెల్ నెంబరు యివ్వండి సార్ !" సదాశివం అడిగాడు.

" ఎందుకు సదాశవం ? పోయి ఆమె కాళ్ళు పట్టుకుంటావా నీకు ఉద్యోగం యిమ్మని, అదేం కుదరదు, నేను చాలా స్ట్రిక్టు? నో రెకమెండేషన్! ఆమె చెప్పిన సమాధానం నాకు చెప్పాలి!" అవతారం అడిగాడు గట్టిగా తల అడ్డంగా ఊపుతూ.

" సార్ ! కొంచెం క్లూ యివ్వండి సార్ - " సదాశివం అడిగాడు ఆలోచిస్తూ.

" ఓకే ! దానికి ఆమె ఏమందో తెల్సా ! నాకు ఆఫీసులో ఏకష్టం వచ్చినా - ఎటువంటి క్లిష్ట సమస్య వచ్చినా పర్సుతీసి మీ ఫోటో చూసుకుంటానండి అంది - " చెప్పాడు అవతారం.

" అవతారం ! నువ్వు సామాన్య మానవుడివి కాదయ్యా ! ఇట్టే నీ మొహం చూస్తే అన్ని సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి." పరబ్రహ్మం అభినందిస్తూ చెప్పాడు.

" అదృష్టవంతుడివి ! నా భార్య ఉంది - ఎప్పుడూ ఏ దిక్కు మాలిన సినిమా యాక్టరు ఫోటోనో పెట్టుకుని తిరుగుతుంది - " విశ్వామిత్రుడు చెప్పాడు.

" ఏం ! నేను అడిగింది ఈ సదాశివంను. మీరంతా చెప్పేస్తున్నారు" చికాకు పడ్డాడు అవతారం - " సైలెంట్ ప్లీజ్ !"

" సార్ ! మీ గొప్పతనం మీకు తెలియదండి - మీ ఆవిడకు తెల్సు !" సదాశివం చెప్పాడు వినయంగా.

" గుడ్ ! గుడ్ ! చెప్పు - ఆమె అభిప్రాయం చెప్పు !" అవతారం అన్నాడు.

" ఆమెకు ఏ సమస్య వచ్చినా మీ మొహం చూడంగానే ఆమెకు వెంటనే పరిష్కారం దొరుకుతుంది-స్వాంతన లభిస్తుంది -ఎందుకంటే జీవితంలో అతిపెద్ద సమస్యనే ఆమె భరిస్తున్నది కాబట్టి - మీ మొహం చూసిం తర్వాత ఆమెకు ఏ సమస్య అయినా తృణప్రాయంగా కనిపిస్తున్నది కాబట్టి - మీ ఫోటోను నిత్యం పర్సులో దాచుకుంటున్నది. " సదాశివం చెప్పాడు." ఎందుకంటే జీవితంలో ఆమెకున్న పెద్ద సమస్య మీరే కాబట్టి - యింకే వచ్చినా అవన్నీ నథింగ్ !"

" ఆ !" అంటూ అవతారం నోరు తెరిచాడు.

అప్రయత్నంగా పరబ్రహ్మం - విశ్వామిత్రుడు చప్పట్లు కొట్టారు.


" యూకెన్‌గో !" అంటూ అవతారం అతన్ని పంపించివేశాడు.

సదాశివం గుండెలనిండా ఊపిరి పీల్చుకుని బయటకు వచ్చాడు. బయట అతని లాంటి వాళ్ళు ఇంకో పాతిక మంది చంకల్లో ఫైళ్ళు పట్టుకుని నిరీక్షిస్తున్నారు తమ వంతుకోసం.

చిరునవ్వుతో బయట కొచ్చిన అతన్ని చూసి కొంతమంది అడిగారు. " ఏం జరిగింది గురూ!" అంటూ " అస్సలేం అడుగుతున్నారు!"

" నో ! నేను చెప్పను - కాన్ఫిడెన్షియల్ - అయామ్ సెలెక్టడ్ ! ట్రై యువర్ లక్ !" అంటూ బయటకొచ్చాడు సదాశివం.

సదాశివంకు ఉత్తరం - దక్షిణం రెండూ లేవు. ఉన్నది కొండంత ఆత్మ విశ్వాసం-


ఎందుకు ఆలోచిస్తున్నావు సఖా! "లక్ష్మీ బౌంబ్" వున్నదిగా! ప్రయోగించూ!!
ఏవిఎమ్.


నీకు అజీర్తి చేస్తుందని.. నీళ్ళల్లో పాలు కలిపా!... నాగ దేవతా!!
ఏవిఎమ్.

బియస్సీలో ఫస్టు క్లాసు డిగ్రీ ! పైగా తనో పెద్ద జీనియస్సని అతగాడి నమ్మకం ! ఈ దేశభవిష్యత్తు తన భుజస్కంధాలపైన ఉందని అతగాడి ప్రగాఢ విశ్వాసం!!

అందుకే ఎన్ని ఇంటర్వ్యూలకు పోయినా - ఇంతవరకు ఎక్కడా సెలెక్టు కాకపోయినా అతడు విచారపడటం లేదు. అతనికి తెల్సు ప్రపంచ మేధావుల్లో అగ్రగణ్యుడైన ఐన్‌స్టీన్ కూడ ఎమ్‌సెట్‌లో ఫెయిలై మెడిసిన్‌లో సీటు సంపాదించుకోలేక పోయాడని, అంతమాత్రాన అతనికి జరిగిన నష్టం ఏముంది కనుక?

అలాగే ముప్పది రెండు సంవత్సరాలు లెక్కలేనన్ని సార్లు అపజయాలు ఎదుర్కొన్న అబ్రహాం లింకన్ చివరి విజయంతో చరిత్రలో తిరుగులేని ముద్ర వేసి అమెరికా ప్రెసిడెంటుగా ప్రపంచ చరిత్ర తిరగరాశాడు అని - చనిపోయేదాకా అతనే ప్రెసిడెంటుగా ఉండి పోయాడని - సదాశివంకు తెలుసు.

అందుకే అపజయాలకు అతను కృంగిపోలేదు ఎప్పుడూ ! పైగా అపజయాలన్నీ విజయానికి సోపానాలే అని అతని నమ్మకం. గజనీ మహమ్మద్ అతనికి స్ఫూర్తి ! అందుకే మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఎన్నో అప్లికేషన్లు పెడుతూ ఉంటాడు సదాశివం సదా!

కాలచక్రం గిరగిర తిరుగుతున్నది - ఓ రోజు

సదాశివం బస్సులో ఎక్కి తన సీట్లో కూర్చుని ఊపిరి పీల్చుకున్నాడు. బస్సు దొరుకుతుందో దొరకదో అని తెగ భయపడ్డాడు. ఈ బస్సు మిస్సు అయితే రేపు జరుగబోయే పెళ్ళికి హాజరు కాలేడు.

బస్సు బయలుదేరుతుండగా ఒక భారీ శాల్తీ వచ్చి అతని పక్క సీట్లో కూలబడింది. అతను కూర్చుంటూ ఇతని కాలును తొక్కాడు. దాంతో ' చచ్చాన్రోయ్' అంటూ బిగ్గరగా అరిచాడు సదాశివం. ఆ కేకకు బస్సు ఆగిపోయింది.

కండక్టర్ వచ్చి ఏం జరిగిందని విచారించాడు.

" బక్కప్రాణిని - ఇతడు నామీద కూర్చునుంటే ఈ పాటికి నా ప్రాణాలు కాస్త పైకి పోయేవి - కాలు కాబట్టి పచ్చడయింది." చెప్పాడు.

" సారీ అండి !" అంటూ ఆ భారీ శాల్తీ చెప్పింది.

బస్సు బయలు దేరింది.... కండక్టర్ లైట్లు వేసి లెక్కలు కడుతున్నాడు - అట్నించి - ఇటు - ఇట్నించి అటు తిరుగుతూ లెక్కలు కడుతున్నాడు.

" హోల్డాన్ !" అని అరిచాడు కండక్టర్. డ్రైవర్ బస్సు నిలిపేశాడు "ఏమయింది?" సదాశివం అడిగాడు.

" ఒక పాసింజరు ఎక్కలేదు - " కండక్టర్ చెప్పాడు.

" అయితే వెనక్కి పోయి ఎక్కించుకు రావాలా? అప్పుడే పాతిక కిలోమీటర్లు దాటి వచ్చేశాం !" సదాశివం బిక్క మొహం పెట్టి అడిగాడు.

" అక్కరలేదు - పోనివ్వండి !" సదాశివం పక్కనున్న భారీ మనిషి చెప్పాడు తాపీగా.

" పాపం వాడెవడో టికెట్టు కొని ఎక్కలేదు-ఎంత బాధపడుతున్నాడో - ఎవడి సొమ్మో కాబట్టి నువ్వు పోనివ్వమంటున్నావు-అదే నీదైతే ఎలా ఉంటుంది." కండక్టర్ అడిగాడు కోపంగా.

ఆ లడ్డుపాటి ఆయన చిరునవ్వు నవ్వాడు - జేబుల్లోంచి తీసి టికెట్లు చూపించాడు - రెండున్నాయి. ఒకటి పై జేబులో పెట్టుకున్నాడు - రెండోది క్రింది జేబులో పెట్టుకున్నాడు.

" రెండో మనిషి ఎక్కలేదా !" కండక్టర్ అడిగాడు.

" లేదు - నేనే తీసుకున్నాను రెండు " చెప్పాడు అతను.

" అరే లగేజికి తీసుకున్నట్లు బరువు ప్రకారం టికెట్టు తీసుకోనక్కరలేదు. ఎంత సన్నగా వున్నా - ఎంత లావున్నా తలకు ఒక్క టికెట్టు కొంటే చాలు " చెప్పాడు సదాశివం, అతని అజ్ఞానానికి చింతిస్తూ.

" ఆ ! నాకు తెల్సులేండి - నేను అంత తెలివి తక్కువ వాడ్నికాదు " గంభీరంగా అన్నాడు ఆ లడ్డతను.

" మరి రెండు కొని నా ప్రాణం ఎందుకు తీశావయ్యా - లెక్క కుదరక నేను ఛస్తున్నా అరగంట నుండి !" కసురుకున్నాడు కండక్టర్.

" ముందు జాగ్రత్త కోసం కొన్నా - పై జేబులో నా టికెట్టును ఎవరన్నా కొట్టివేసినా - పొరపాట్న టికెట్టు పోయినా - ఎగ్స్ట్రా టికెట్టు ఉంటే క్షేమం అని కొన్నా!" చెప్పాడు అతడు.

కండక్టరుకు నోట మాట రాలేదు.

" రైట్ రైట్ !" అంటూ సీట్లో కూలబడి పోయాడు.

కొంత దూరం పోయింతర్వాత సదాశివంకు అనుమానం వచ్చి అడిగాడు.

" గురువుగారు - గురువుగారు మీరు కోప్పడద్దు - నాకో సందేహం వచ్చింది - ఒక వేళ మీరెండవ టికెట్టు కూడ పోయిందనుకోండి -అప్పుడెలా?"

" నేను అంత తెలివి తక్కువ వాడిలా కనిపిస్తున్నానా నీకు - రెండు టికెట్లు పోయినా నాకు నష్టం లేదు - ఎందుకంటే నా దగ్గర లోపలి జేబులో పాసు వుంది!" వెంటనే చెప్పాడు అతను కోపంగా.

సదాశివం నోరు మూతపడిపోయింది.. కాసేపటి తర్వాత సందేహిస్తూ తెరుచుకుంది.

" గురువుగారు-గురువుగారు - క్షమించాలి - మీపై జేబులో టికెట్టు పోయిందని - కింది జేబులో టికెట్టు పెట్టుకున్నారు - సరే - అరెండు పోయినా క్షేమం కోసం పాసు ఉండనే ఉంది- నాకు చిన్న సందేహం- ఒక వేళ అ పాసుకూడ ఎక్కడన్నా పోతే ఏం చేస్తారు?"

" ఓర్నీ ! నేను నీకు అంత తెలివి తక్కువ వాడిలా కనిపిస్తున్నానా? చూడబోతే నువ్వొట్టి అమాయకుడిలా వున్నావు-నేనెవరో తెలుసా-ఆర్టీసీ స్టాఫును-నా దగ్గర ఐడెండిటి కార్డు కూడ ఉంది. దాంతో ఫ్రీగా ట్రావెల్ చెయ్యచ్చు! " లద్దాయన కోప్పడి కళ్ళు మూసుకున్నాడు.

కాసేపటికి ఉండబట్టలేక అడిగాడు " గురువుగారు - గురువుగారు - నాకో చిన్న సందేహం ! ఒక వేళ మీ రెండు టికెట్టులు పోయి, పాసుపోయి, కార్డు పోయిందనుకోండి ? అప్పుడేం చేస్తారు ?" లద్దాయన ఇతగాడ్ని కిందా మీదా చూశాడు.

" నేనంత తెలివి తక్కువ వాడినా ? మా బావ హోమ్ మినిష్టరు. ఆయనకు ఫోన్ చేసి చెబుతాను - విడిపించమని ! ఇంక నా తెలివితేటల గురించి నువ్వేం అనుమానపడకు!" అని కసిరి కునుకులో పడ్డాడు ఆ లద్దతను.

సదాశివం ఇంక నోరెత్తలేదు. తన తెలివి తక్కువ తనానికి చింతిస్తూ కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

ఉదయం బస్సు దిగి - కళ్యాణ మండపానికి వెళ్ళాడు.... స్నేహితుడి పెళ్ళి అయిపోయి - భోజనాలు అయ్యేసరికి మధ్యాహ్నం అయిపోయింది. కాస్త విశ్రమించాడు. సాయంత్రం కాగానే తయారై బజారుకు పోయి ఓ మంచి బహుమతి కొని గిఫ్టు ప్యాక్ చేయించాడు. డైరీ తీసి అడ్రసు చదువుకుని ఆటోలో కూర్చుని అక్కడికి పోనివ్వమన్నాడు.

కాసేపటికి ఆటో ఓ మంచి ఇంటిముందు ఆగింది... నేమ్ బోర్డు చూసి తృప్తిగా తలాడించాడు.

కాలింగ్ బెల్ కొట్టాడు... ఓ రెండు నిమిషాలు బెల్ కొట్టింతర్వాత -

ఓ పెద్ద ముత్తయిదువ వచ్చి తలుపు తీసింది....

" అవతారం గారు ఉన్నారాండీ !" అడిగాడు ఆమెను చూసి.

" ఉండక ఎక్కడికి పోతారు ?" ఆమె కోపంగా అడిగింది.

" నాకు తెలియదండి ఆయన ఎక్కడికి పోతారో? " కంగారు పడ్డాడు ఆమె ఆకారానికి - ఆమె కోపానికి కొంచెం బెదిరి.


ఇది 'అల్లావుద్దీన దీపం' ఇతే ఏంకోరుకుంటావ్! తమ్ముడూ!?
నా భార్యా పిల్లలూ బాగుండాలని!
ఏవిఎమ్
ఉండటానికి, మన క్లాసులో అందగత్తెలే, వున్నారు కానీ! వాళ్ళంతా నాకన్నా వయస్సు ఎక్కువ!
'రామా బార్' ఎదురుగా మా ఇల్లు 'కృష్ణా బార్' ఎదుటు మా బడి!!
ఎవరు అల్లరి చేసినా! నన్నే కొడుతున్నారు ఆ టీచర్!.. నీ మాజీ భర్తంట గదా!?
ఏవిఎమ్

“ మరి ఏమీ తెల్సుకోకుండా ఎందుకొచ్చావు?” ఆమె అడిగింది.

“ తెల్సుకుందామనే వచ్చానండి - తమరి దర్శనం అయింది... వారున్నారనడానికి నిదర్శనంగా ” చెప్పాడు.

“ ఇంతకీ నువ్వెవరు?” అడిగింది ఆమె.

“ నేను ఆయనకు తెలియక పోవచ్చండి - తెల్సినా గుర్తుండక పోవచ్చండి - గుర్తుండినా పోల్చుకోక పోవచ్చండి !” చెప్పాడు.

“ నాకు ఒక్కముక్క అర్థం కాలేదు ఈపోవడాలు-రావడాలు !” ఆమెకోపంగా చెప్పింది.

“ అందుకే అవతారం గారిని పిలవండి - ” చిన్నగా అడిగాడు.

“ వారు బయటకు రారు - ” ఖచ్చితంగా చెప్పింది.

“ ఏమండి ? ఘోషానా?” సందేహించాడు.

“ ఘోషానా పాడా - ఏవో పాడు ఆసనాలు చేస్తూ ఆపసోపాలు పడుతున్నాడు.” వివరించింది ఆమె విసుగ్గా.

“ అయితే నేనే లోనికి వస్తానండి అవతారం గారి అవతారం చూడ్డానికి.” వినయంగా చెప్పాడు సదాశివం.

“ సరే తగలడు - ” అంటూ లోపలికి నడిచింది - తప్పదన్నట్లు.

లోపల అవతారం తలక్రిందకు పెట్టి కాళ్ళు పైకి పెట్టి యోగాసనాలు వేస్తున్నాడు.

“ నమస్కారమండి - నేను సదాశివంను -” చెప్పాడు “ నమస్కారం ”.

“ ఏంటి తలతిక్కగా మాట్లాడతావు - సదాశవమా?” ధామ్మని కిందపడ్డాడు అవతారం నమస్కారం పెట్టబోయి.

“ నేను గుర్తున్నానండీ !” అడిగాడు సదాశివం.

“ ఆ ! ఆ ! గతజన్మలో - ఆ ! ఆ ! సంవత్సరం క్రిందట కావును ఓ సారి ఇంటర్వ్యూలో కల్సుకున్నాం - మళ్ళీ ఏమన్నా ఇంటర్వ్యూ ఉందా?” అవతారం కంగారు పడుతూ అడిగాడు . “ ఇంతకీ ఎందుకొచ్చావు ?”

“ మీకు కృతజ్ఞతలు తెలియచేద్దామని - థ్యాంక్సు సార్ !”

“ అదేంటి - ఆ ఉద్యోగంలో నిన్ను నేను సెలెక్టు చెయ్యలేదే ? నాకు థ్యాంక్సు ఎందుకబ్బా ?” తల కొట్టుకున్నాడు అవతారం.

“ అదే నా లైఫ్‌కు టర్నింగు పాయింటు! మీరు కనుక పొరపాట్న నన్ను సెలక్టు చేసి ఉంటే ఆ మూడువేల జీతంతో మీసంస్థలో మురిగి పోయేవాడిని- ఆ కోపంతో నేను హైద్రాబాద్‌లో ఓ కాల్‌సెంటర్లో మంచి జాబ్ సంపాదించాను. నెలకు పదిహేను వేలు

సంపాదించుకుంటున్నాను - అందుకే సార్, థ్యాంక్సు చెబుదామని వచ్చాను - మీరు మొహమాట పడకపోతే నేను తెచ్చిన ఈ చిన్న ప్రజెంటేషన్ తీసుకోవాలి!" చెప్పాడు సదాశివం మొహమాట పడుతూ.

" మా వారికి చాలా మొహమాటం బాబు ! ఎవరన్నా ఏదన్నా యిస్తే వద్దు అనడానికి చాలా మొహమాటం ! అది అక్కడ పెట్టు !" చెప్పింది ఆమె.

" ఓకే ! థ్యాంక్సండి ! వినయంగా నమస్కరించాడు సదాశివం గిఫ్టు అక్కడ పెట్టి.

" అలాగే – ఎవరికి ఏదన్నా యివ్వాలంటే అవతలి వారు పుచ్చుకుంటారో , పుచ్చుకోరో, అని తెగమొహమాటం మావారికి. అందుకే ఎవరికి ఏదీ యివ్వరు మొహమాటంతో మావారు." చెప్పింది అండాళ్ళు !

" హిహిహి ! నాకు భలే మొహమాటమోయ్!" చెప్పాడు అవతారం శీర్షాసనం వేస్తూ.

" ఇంతకీ ఆ కుక్క మొగదో ఆడదో కనుక్కున్నావా? " తనే అడిగాడు మళ్ళీ.

" ఖచ్చితంగా మొగదే అయి ఉంటుంది సార్!" చెప్పాడు


" ఎందుకు? " అవతారం అడిగాడు.

" ఆడదైతే మీ ఆవిడ ఊరుకోదు కాబట్టి !" చెప్పాడు సదాశివం ఠక్కున.

శీర్షాసనం వేస్తున్న అవతారం ఇంకోసారి 'ఢాం' అని కింద పడ్డాడు ఆ సమాధానానికి.

*- తేజ తెలుగు వీక్లీ ఏప్రిల్ -24-2009*




అవును, ఇద్దరూ రాసింది కరక్టే!
ఆ పిల్ల 'రంభ' లా వుంది మరి!!
నా స్కూల్లో కూడా ఎలక్షన్లు పెట్టారు!
దొంగ ఓట్లు వేసి ఎలా గెలవాలో
చెప్పు డాడీ!
నా పెళ్ళి తర్వాత, మొగుణ్ణి కుక్కలాగా
నా చుట్టూ తిప్పుకునే చిట్కాలు నాకూ
చెబుతూ వుండు మమ్మా!
AVM
సిక్సర్లు ఎలా కొట్టాలో, నేను
చూపించనా!!
AVM